కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘం సభ్యులు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: సంక్షేమ సంఘం సభ్యులు సమష్టిగా పని చేసి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. చింతల్ డివిజన్ ఎస్ఎల్‌బీ నగర్ నూతన సంక్షేమ సంఘం మంగళవారం శంభీపూర్ రాజును కలిశారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ..కాలనీ అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారం అందిస్తానన్నారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్ రాజును కలిశారు. పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి ఎస్ఎల్‌బీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కప్పెరా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు భరత్, మహేష్, కోశాధికారి బాలస్వామి గౌడ్, ఉమాశంకర్, కుమార్, వెంకటేష్, యాదిరెడ్డి, బ్రహ్మం పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణపై అవగాహన


మాట్లాడుతున్న అధికారులు


అవగాహన కార్యక్రమంలో స్వయం సహాయక మహిళా బృందాలు

కుత్బుల్లాపూర్: గాజులరామరం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ ఆధ్వర్యంలో, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్, శానిటేషన్ మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో స్వయం సహాయక మహిళా బృందాల గ్రూపులకు సీజనల్ వ్యాధులను ఎలా అరికట్టాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమతమ కాలనీలలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా తమ బాధ్యతగా భావించి అందరికీ చెప్పాలని మహిళా గ్రూపులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్లు వంశీ, అశోక్, మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: రౌడీ షీటర్లు సత్ప్రవర్తన ఉంటే వాటిని ఎత్తివేసే విషయంలో పునరాలోచిస్తామని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. పేట్ బషీరాబాద్, షామీర్‌పేట్, అల్వాల్, జీనో వేల్యూ, మేడ్చల్, సూరారం, దుండిగల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న సుమారు 50 మంది రౌడీషీటర్లను మంగళవారం పేట్ బషీరాబాద్ డీసీపీ కార్యాలయం వద్దకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబ బాధ్యతలను దృష్టిలో పెట్టుకొని ఇకనైనా జాగ్రత్తగా ఉండాలని, 10 ఏళ్ల పాటు ఎటువంటి నేరాలు చేయని వారి జాబితాను తయారుచేసి రౌడీషీట్ ఎత్తివేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు రాములు, శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు విజయ వర్ధన్, రాహుల్ దేవ్ లతోపాటు పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న మహిళ అరెస్టు

జగద్గిరిగుట్ట: కిరాణా షాపులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. లెనిన్‌నగర్‌లో ఏ-బ్లాక్, రోడ్డు నెంబర్-8లో విద్యార్థులే టార్గెట్‌గా సునీత దేవి అనే ఓ మహిళ కిరాణా షాపులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తుంది. పక్కా సమాచారంతో మంగళవారం బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మహిళ దగ్గర నుంచి 9.5 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకొని జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఈ గంజాయి ఎక్కడి నుంచి సరఫరా చేసుకుంటున్నారని.. మహిళకు ఎవరు సహాయం చేస్తున్నారు..ఇంకా ఎంత మంది ఇందులో భాగస్వాములుగా ఉన్నారు..అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నారాయణ స్కూల్ విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతి పుట్టినరోజు ఇంటి ఆవరణలో మొక్కలు నాటడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయ్ వర్ధన్ పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్

జీడిమెట్ల: వాహనాలకు సరైన నెంబరు ప్లేట్ లేకుంటే చర్యలు తప్పవని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ జి.మల్లేష్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల పీఎస్ పరిధిలో సీఐ ఆధ్వర్యంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో నెంబర్ ప్లేట్ లేని 19 వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పటికప్పుడు నెంబర్ ప్లేట్లను బిగించి పంపించారు. ఈ సందర్భంగా వాహనదారులతో ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. రాంగ్‌రూట్‌లో వాహనాలను నడపడంతో పాటు చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వకూడదని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్సైలు హరీష్, అంజనేయులు, సతీష్‌రెడ్డి, నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లేష్

ట్రేడ్ యూనియన్‌లపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

కూకట్‌పల్లి: విలేకరులు తమ వృత్తి నైపుణ్యంతో పాటు ట్రేడ్ యూనియన్‌ల విధి విధానాలపై అవగాహన పెంచుకోవాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. మంగళవారం యూనియన్ జిల్లా శాఖ, కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ నేతృత్వంలో శేషాద్రినగర్ కమ్యూనిటీ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సరైన వైద్య సదుపాయాలు అందక పలువురు విలేకరులు ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టులకు మాత్రమే అక్రిడిటేషన్ ఇవ్వాలన్నారు. మండల, జిల్లా కేంద్రాలుగా పరిగణలోకి తీసుకుని ఇళ్ల స్థలాలను మంజూరు చేసే విధంగా యూనియన్ కృషి చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన తర్వాత రాష్ట్ర కమిటీలో గ్రేటర్ హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బాధ్యులను సత్కరించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్‌రెడ్డి, కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, గౌస్ మొయినుద్దీన్, అనిల్, చిన్న ప్రతికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబా, ప్రధాన కార్యదర్శి అశోక్, హెచ్‌యూజే అధ్యక్షులు శిగ శంకర్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్కయ్య, మామిడాల రవీందర్ రెడ్డి, సలీం పాషా, పరమేష్, మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ కరీం, రంజిత్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

కుత్బుల్లాపూర్: రెండున్నర ఏళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కొంపల్లి మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ బైరి శ్రీవిద్య అన్నారు. మంగళవారం పోచమ్మగడ్డలో జరిగిన 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట'కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన చదువును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడిబాటను ప్రారంభించిందన్నారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంప్ నిర్వహించి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పీహెచ్‌డీ వైద్యులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ బాటలో పాల్గొన్న కౌన్సిలర్ బైరి శ్రీవిద్య



ర్యాలీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

మగ్దూంనగర్‌లో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'

జగద్గిరిగుట్ట: మగ్దూంనగర్‌లో మంగళవారం అమ్మ మాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆశా వర్కర్లు పలు కాలనీలలో ర్యాలీగా వెళ్లి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ ర్యాలీలో కార్పొరేటర్ జగన్, స్థానిక నాయకులు పాల్గొని చైతన్యపరిచారు. రెండున్నర ఏళ్లు నిండిన పిల్లల పేర్లను అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదు చేసుకోవచ్చని, ఈ కేంద్రాలలో సదుపాయాల గురించి తెలియచేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, రేణుక, సత్యలక్ష్మి, శ్యామల, ఉమారాణి, సంతోషి, ప్లాన్ ఇండియా వలంటర్ కల్పన, ఆశ వర్కర్లు స్వప్న, లక్ష్మి, కిషోర బాలికలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రంగారెడ్డినగర్: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.తిరుమల అన్నారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్ ప్రాంతంలో గల 1,2, 3, అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గిరినగర్, చెన్నారెడ్డినగర్, బాబూ జగ్జీవన్‌రామ్‌నగర్ ప్రాంతాల్లో చిన్నారులు, వారి తల్లులు, ఆయాలుతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్.నీరజ, నసీమా, వాణి, సునీత, ఆశా వర్కర్లు ఆయాలు ఏ.ఎల్.ఎం.సి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. మంగళవారం రూ.12 లక్షలతో చేడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. మాగ్దూంనగర్ నుంచి సోమయ్యనగర్ వరకు జరుగుతున్న ఈ లింక్ రోడ్ పనుల వల్ల స్థానికులకు ప్రధాన రహదారులో ట్రాఫిక్ సమస్య తగ్గవచ్చని ఆయన అన్నారు. ప్రజల కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తానని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, సతీష్, సంపత్ రెడ్డి, హుస్సేన్, రవికుమార్, గోవర్ధన్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని అవుట్ పోస్ట్ సర్కిల్ నందు ట్రాఫిక్ సమస్య తీరనుంది. దాదాపు రూ.48 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారంచుట్టారు. మంగళవారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డితో కలిసి కార్పొరేటర్ జగన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంత కాలంగా జగద్గిరిగుట్ట అవుట్ పోస్ట్‌లో ట్రాఫిక్ జామ్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలు ఫిర్యాదులు రావడంతో రోడ్డు వెడల్పు పనులతో పాటు డివైడర్ కూడా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ ఏఈ తిరుపతి, ఎలక్ట్రికల్ ఏఈ రాధాకృష్ణారెడ్డి, గజేంద్ర బాబు, రవికుమార్, మల్లేష్‌గౌడ్, వేణుయాదవ్, గిరిబాబు, పాపిరెడ్డి, సత్తిరెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షపు నీటిని తొలగించండి



కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని కూకట్‌పల్లి డివిజన్ పాపారాయుడు నగర్ ప్రధాన రహదారి చెరువును తలిపస్తుంది. ఇటీవల కురిసిన వర్షానికి నీరు అంతా రోడ్డుపై చేరింది. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని కోరుతున్నారు.

కూలిన భారీ వృక్షం.. తొలగించిన సిబ్బంది


నేలకొరిగిన భారీ వృక్షాన్ని తొలగించిన డీఆర్ఎఫ్ సిబ్బంది

మోతీనగర్: మూసాపేట డివిజన్, మోతీనగర్ బాలాజీ అపార్ట్‌మెంట్ సమీపంలో భారీ వృక్షం నేలకొరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. విషయాన్ని స్థానికులు మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షులు నల్లమాల్పు అంజిరెడ్డికి అందజేశారు. ఆయన వెంటనే డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చేరుకొని భారీ వృక్షాన్ని తొలగించారు. రాకపోకలు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. డీఆర్ఎఫ్ సిబ్బందికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

షరతులు లేని రైతు రుణమాఫీ అమలు చేయాలి


పుష్పాల భాస్కర్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం షరతులు లేని రైతు రుణమాఫీ అమలు చేయాలని సుభాష్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుష్పాల భాస్కర్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా రైతు రుణమాఫీ చేస్తానని ఏడుపాయల దుర్గమ్మ సాక్షిగా ప్రమాణం చేసి నేడు రుణమాఫీపై మెలికపెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో దాదాపు 70 లక్షల రైతులు రుణ మాఫీపై ఎదురు చూస్తున్నారని, ఆహారభద్రత కార్డును రుణమాఫీకి మెలిక పెట్టడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. అదే విధంగా రెన్యువల్ చేసుకున్న రుణాలకు మాఫీని వర్తించకపోవడంతో చాలా మంది రైతులు నిరాశలో ఉన్నారన్నారు. రైతాంగానికి సాగు నీరు అందించక పోగా, రైతుబంధు విషయంలోనూ, రైతుల రుణమాఫీ విషయంలో వ్యవహరిస్తున్న తీరు రైతుల నడ్డి విరిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వ తీరు ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతాంగానికి 24 గంటల పాటు కరెంటు, సాగునీరు, తాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతాంగంపై కనికరం లేకుండా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికై నా షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలన్నారు. అదే విధంగా నిరుద్యోగులపై వ్యవహరిస్తున్న కఠిన వైఖరిని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం


గ్రీన్‌హిల్స్ కాలనీలోని భవ్య సాయి హైస్కూల్‌లో..

సుభాష్‌నగర్: మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు కె.రామేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్ కాలనీలోని భవ్య సాయి హైస్కూల్‌లో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. అదే విధంగా నాటిన మొక్కలు వృక్షాలుగా మారేంత వరకు సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, భవ్య సాయి హైస్కూల్ డైరెక్టర్లు రాజేందర్‌రెడ్డి, నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం


నీరజ్


సమీరా

జగద్గిరిగుట్ట: వ్యక్తి అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. శ్రీరాంనగర్‌కు చెందిన వెంకటరమణ, నాగమణికు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు ఎరుపు నీరజ్ (22) మే 20న ఫోరం మాల్‌లో డ్యూటీకి వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో పనిచేసే దగ్గరకు వెళ్ల వాకబు చేయగా ఆరోజు డ్యూటీకి రాలేదని చెప్పారు. కొంత కాలంగా మానసిక స్థితి బాగాలేక పోవడంతో ఇలానే అనేక సార్లు వెళ్లి మళ్లీ తిరిగి వచ్చినట్లు తల్లి తన ఫిర్యాదులో పేర్కొంది. అలానే తిరిగి వస్తాడని ఇన్ని రోజులు వెచి చూసి, తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు చేపట్టారు.


మానసిక స్థితి బాగాలేని వృద్ధుడు..

జగద్గిరిగుట్ట: మానసిక స్థితి బాగాలేని వృద్ధుడు అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. తుడుముల్ల శంకర్ (65) ఊరి నుంచి తన భార్యతో 20రోజుల క్రితం జగద్గిరిగుట్ట, పాపిరెడ్డినగర్‌లో ఉంటున్న తన కూతురు దగ్గరకు వచ్చారు. మంగళవారం కూతురు, అల్లుడు డ్యూటీకి వెళ్లగా ఉదయం 11 గంటల సమయంలో తన భార్య బాత్ రూం వెళ్లి వచ్చే లోపు శంకర్ బయటకు వెళ్లిపోయాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ..

కుత్బుల్లాపూర్: అనుమానాస్పదస్థితిలో మహిళ అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..కొంపల్లి గార్డెన్ సొసైటీకి చెందిన అమీర్ అలీ, సమీరా (32)లు భార్యాభర్తలు. ప్రైవేట్ ఉద్యోగి అయిన సమీరా ఈనెల 15న రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. ఆమె మొబైల్ ఫోన్ సైతం స్విచ్చాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య


అరుణ (ఫైల్)

నిజాంపేట్: భర్త వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లి సాయినగర్‌కు చెందిన ఎర్రగాళ్ల గోపీ, అరుణ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అరుణకు ఇద్దరు కుమార్తెలు జన్మించడంతో భర్త గోపీ వేధింపులు మొదలు పెట్టాడు. అదనపు కట్నం తేవాలని శారీరకంగా, మానసికంగా అరుణను వేధించడంతో ఈ విషయమై పలుమార్లు తల్లిదండ్రులకు చెప్పింది. ఇటీవల వేధింపులు మరింత తీవ్రతరం కావడంతో ఈనెల 15న అరుణ ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లిదండ్రులు వచ్చేలోపే అరుణ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీంతో తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయంటూ, భర్త వేధింపులతో మృతి చెందిందని అరుణ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడిగా భిక్షపతి యాదవ్


నియామకపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ మల్లారెడ్డి తదితరులు

నిజాంపేట్: నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడిగా భిక్షపతియాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేయగా బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతి యదవ్ మాట్లాడుతూ..నిజాంపేట్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాన్నారు. తనకు పదవి అప్పగించిన అసెంబ్లీ కన్వీనర్, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాచుపల్లి ఎస్ఐగా శ్రీనివాసులు



నిజాంపేట్: బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న మహేష్‌గౌడ్ గచ్చిబౌలి స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్తూరు పీఎస్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

రేషన్ కార్డులను మంజూరు చేయాలి

బాలానగర్: అర్హులైన పేదలకు రేషన్ కార్డులను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బాలానగర్ ఫిరోజ్‌గూడలోని సివిల్ సప్లై కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రేషన్ కార్డులు ఇస్తామని ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి. శంకర్, సతీష్, భాగ్యలక్ష్మి, భారతి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

'ది మాస్టర్ మైండ్స్ స్కూల్'పై చర్యలు తీసుకోవాలి


పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

కూకట్‌పల్లి: గోపాల్‌నగర్‌లోది మాస్టర్ మైండ్స్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నారని మంగళవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి


గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థినులు, కళాశాల సిబ్బంది

కూకట్‌పల్లి: విద్యార్థినులు ఉద్యోగాల వేటకే పరిమితం కాకుండా ఇతరులకు అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ప్రగతి మహిళా కళాశాల డైరెక్టర్ రవీందర్‌రావు అన్నారు. వివేకానంద నగర్‌లోని కళాశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఏటీసీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పట్టాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

కూకట్‌పల్లి: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం వెంకటేశ్వరావు అన్నారు. కేపీహెచ్‌బీ రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై విద్యార్థుల నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని వివరించారు. వివిధ విభాగాల్లో నాయకులుగా ఎంపికైన వారిని అభినందించారు. అదేవిధంగా హైదర్‌నగర్ బ్రాంచ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్ఐ మన్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ శిరీష, ఇందిర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.